ఘనంగా జననేత జన్మదిన వేడుక

- అంబరాన్నంటిన ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు సంబరం
- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల సందడి
- పలు చోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా గురువారం సంబరంలా నిర్వహించారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ముఖ్యమంత్రికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులకు కేక్, స్వీట్లు అందజేశారు. అనంతరం ఆయన పట్టణంలోని నవజీవన్ అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం నిర్వహించారు. తరువాత ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే ఉపముఖ్యమంత్రి సతీమణి రోజమ్మ తమ స్వగృహం వద్ద సుమారు 300 మందికి చీరలు, దుప్పట్లు, పంచలు,తువ్వాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మక్కువ వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సాలూరు వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, కౌన్సిలర్లు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు,గొర్లె జగన్‌మోహన్‌రావు, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

కేక కట్ చేసిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: తమ పార్టీ అధినాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీ, మొక్కలు నాటే కార్యక్రమం, కేక్ కటింగ్ అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలకసంఘం ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, సర్పంచ్‌లు, స్టేట్ డైరెక్టర్లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, స్థానిక సీనియర్ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


సాలూరు: కేక్ కట్ చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సాలూరు: ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన 98 డీఎస్సీ ఉపాధ్యాయులు


పార్వతీపురం టౌన్: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జోగారావు తదితరులు


సాలూరు: వృద్ధులకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి సతీమణి రోజమ్మ


సాలూరు: బాగువలస సచివాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ఎంపీపీ రెడ్డి సురేష్


పార్వతీపురం టౌన్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు


మక్కువ: సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు


బలిజిపేట: 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి చేస్తున్న పాలాభిషేకం


సీతానగరం: లచ్చయ్యపేటలో కేక్ కట్‌చేస్తున్న సర్పంచ్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి పుష్పాలంకరణ


ఎర్రకలువ పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది సమీపంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ఎర్ర కలువపూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయ అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహ స్వామివారిని అర్చకులు అలంకరించారు. సీతానగరం మండలానికి చుట్టు పక్కల గల గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపుల చెల్లింపు, క్షీరాభిషేకం, కుంకుమపూజలను భక్తులతో అర్చకులు చేయించారు. స్వామివారి దర్శనానికి ఉపవాసాలతో దూర ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న వారందరికీ తీర్థప్రసాదాల వితరణ చేశారు.

మేలుకొలుపు


వెంగాపురం పురవీధుల్లో తిరుగుతున్న ఏసుభక్తులు

బలిజిపేట: క్రిస్మస్ సందర్భంగా బలిజిపేట మండలంలోని వెంగాపురం విచారణ సర్వేశ్వరుని మాతా దేవాలయం ఆధ్వర్యంలో ఏసుభక్తులు గ్రామ పురవీధుల్లో మేలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఫాదర్స్ కె.ఆనంద్, రవితేజల ఆధ్వర్యంలో భక్తులు క్రిస్మస్‌కు ముందు తొమ్మిది రోజులు పురవీధుల్లో మేలుకొలుపు నిర్వహించి ప్రజలకు ఏసునామాన్ని వినిపిస్తున్నారు. భక్తులు కొవ్వొత్తులతో వచ్చి తెల్లవారుజామున 4గంటలకు చర్చివద్ద మేలుకొలుపు కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోని వీధుల్లో సంచరించి చర్చివద్దకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో మహిళలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు


వేణుగోపాలస్వామివారిని ఊరేగిస్తున్న మాలాధారులు

సీతానగరం: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో గోవింద మాలాధారణ చేసిన భక్తులు స్వామివారిని ఆలయ అర్చకులతో కలిసి పల్లకీలో అధిష్ఠించి గురువారం తిరువీధి చేశారు. అంతకుముందు భక్తులు సువర్ణముఖి నదిలో స్నానాలు చేసి వేణుగోపాలస్వామిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో పల్లకితో పయనమై మార్కెట్ మీదుగా హనుమాన్ జంక్షన్ వరకూ గోవింద నామాలతో మేల్కొలుపు, నగర సంకీర్తన చేస్తూ తిరిగి వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

పాలకొండ రూరల్: రైతులు సేంద్రియ విధానంలో సాగు చేయటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏపీ ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి పి.సూరపునాయుడు అన్నారు. మండలంలోని గోపాలపురం సమీపంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై రైతులకు అగాహన కల్పించారు. సంబంధిత శాఖ అధికారులు లక్ష్మునాయుడు, తిరుపతిరావు, వెంకటనాయుడు తదితరులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, మహిళా రైతులు ఉన్నారు.

క్రీడా పోటీలకు సిద్ధం కావాలి

పాలకొండ రూరల్: ఈ నెల 26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాథులు తెలిపారు. నియోజకవర్గ, మండల క్రీడా నిర్వాహకులు వి.పుష్పనాథం, ఆర్.రాములు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతీ సచివాలయ పరిధిలో ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న క్రీడాకారులను జట్లుగా సిద్ధం చేయాలన్నారు. పీడీఎస్ బియ్యం ప్రతీ ఇంటికి అందించేలా సచివాలయ సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఇందుకు సంబంధించి వలంటీర్లను సమన్వయం చేయాలన్నారు.

అక్షరానికి అగ్రతాంబూలం

- ట్యాబ్‌ల పంపిణీలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పిల్లలకు విద్యను ఆస్తిగా ఇవ్వాలని సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అక్షరానికి అగ్రతాంబూలం వేస్తూ ప్రభుత్వ విద్యావ్యవస్థకు నూతన జవసత్వాలు తీసుకువచ్చారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో నిర్వహించిన బైజ్యూస్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో పలువురు 8వ తరగతి విద్యార్థులకు ఈ సందర్భంగా ట్యాబ్‌లు పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. జగనన్న అమ్మ ఒడి,గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్య తదితర పథకాల ద్వారా విద్యకు తన పాలనలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని వివరించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్, మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్సార్‌సీపీ సాలూరు పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మక్కువ వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సాలూరు వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గొర్లె జగన్‌మోహన్‌రావు,రాంబాయి తదితరులు, ఎంఈఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

పార్వతీపురంటౌన్: విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం మండలంలోని నర్సిపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60మందికి ట్యాబ్‌ల పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్, గ్రామ సర్పంచ్ సీహెచ్ బంగారమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


సాలూరు: ట్యాబ్‌లు పంపిణీ చేసిన విద్యార్థులతో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఘనంగా క్రిస్మస్ హై టీ

పార్వతీపురంటౌన్: క్రిస్మస్ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ హై టీ కార్యక్రమాన్ని స్థానిక లయన్స్ కల్యాణ మంటపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని, శాంతిని ప్రబోధిస్తాయన్నారు. కార్యక్రమంలో కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. ఏసు ప్రభువు గీతాలకు బాలికలు నృత్యం చేశారు. బిషప్ సుదర్శనరావు, తిమోతి యేసు బోధనలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పాస్టర్లు సుధీర్‌చంద్ర, సూర్యప్రకాశ్, ఎన్.జోసెఫ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

దిశ యాప్ మహిళలకు శ్రీరామ రక్ష

సీతానగరం: ప్రభుత్వం తెచ్చిన దిశ యాప్ మహిళలకు శ్రీరామ రక్షగా దోహదపడుతుందని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ర్యాగింగ్ నివారణ, దిశ యాప్ వినియోగంపై ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిస్తూ, ర్యాగింగ్‌కు పాల్పడిన వారి ఏవిధమైన శిక్షలుంటాయో వివరించారు. అలాగే దిశ యాప్‌ను విద్యార్థులంతా ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయాలని, ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌లో ఉన్న యాప్ ద్వారా పోలీసులకు తెలియజేస్తే రక్షణగా, ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు

పార్వతీపురంటౌన్: కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మార్‌నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వైద్య సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. గతంలో రక్తహీనతను గుర్తించిన విద్యార్థుల ఆరోగ్యం ఏ మేరకు మెరుగుపడింది. వారి హిమోగ్లోబిన్ శాతం ఏ మేరకు వృద్ధి చెందింది, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పరిశీలించారు. ఆరోగ్య సమస్యలు తెలియజేసిన కొంతమంది విద్యార్థులకు వైద్యసిబ్బందితో రక్త పరీక్షలు చేయించి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది డి.పోలమ్మ, పి.పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న హెల్త్‌ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

ఆశ్రమ పాఠశాల తనిఖీ

సీతంపేట: దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల డైరీలు, లెస్సన్ ప్లాన్లు, బోధనా విధానం, తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

చెకుముకి పోటీల్లో నిడగల్లు విద్యార్థుల ప్రతిభ

సీతానగరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా జనవిజ్ఞాన వేదిక సమన్వయ కర్త, జోగింపేట కేజీబీవీ సూపర్‌వైజర్ శైలజ ఆధ్వర్యంలో గురువారం 9 పాఠశాలలకు చెందిన 30 మంది (8,9,10 తరగతులు) విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ టెస్ట్‌లో మండలంలోని నిడగల్లు ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి, జి.రోహిత్, తొమ్మిదవ తరగతి విద్యార్థి కె.ప్రవీణ్, ఎనిమిదవ తరగతి విద్యార్థి టి.వెంకటేష్ ప్రథమస్థానంలో నిలిచారు. విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులు జిల్లా కేంద్రం పార్వతీపురంలో జనవరి 7న జరగనున్న టెస్ట్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలవడంతో వారిని హెచ్‌ఎం శివన్నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరం

మక్కువ: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 8.9.10వ తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయి పోటీలు నిర్వహించారు. 570 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో 21మంది విద్యార్థులు మండలస్థాయి పరీక్షకు అర్హత సాధించారు. గురువారం మక్కువ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పోటీలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సహకారంతో నిర్వహించారు. మండల స్థాయి పోటీలలో మక్కువ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, శంబర ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు హేమలత మాట్లాడుతూ, విద్యార్థులు పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలంటే, అన్ని రకాల పోటీలను ఎదుర్కోవాలని సూచించారు. స్థానిక వైద్యులు పి.మల్లేశ్వర రావు, పి.సీతామహాలక్ష్మిల సహకారంతో విజేతలందరికీ బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల ఎంఎస్ఆర్ ఫౌండేషన్, యూటీఎఫ్ అధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాలల వారీగా బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు ఎస్.రమేష్, జి.రామారావు, ఎస్.రాంబాబు, పి.మధు, యూటీఎఫ్ నాయకులు శివప్రసాద్, ఎం.సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.


చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో కోఆర్డినేటర్ శైలజ, ఉపాధ్యాయులు


మక్కువ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలులో ఇబ్బంది ఉండకూడదు

- ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సేకరణ, విక్రయం పూర్తి చేయాలని ఆర్డీఓ హేమలత అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె డీకె పట్నం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం అమ్మేందుకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తక్షణమే అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ధాన్యం సేకరణ కేంద్రంలో అవసరమైన గన్నీబ్యాగ్‌లు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్‌లైస్ అధికారులు, మండల వ్యవసాయాధికారి, డీకే పట్నం గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

సీతానగరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ పిల్లలు, బాలింతలు గర్భిణులకు ఐసీడీఎస్ అధికారుల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం జోగింపేట అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సరుకులను ఐసీడీఎస్ పీఓ సుగుణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల 10 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె కారణంగా ప్రీస్కూల్ పిల్లలకు పౌష్టికాహారం లేక ఇబ్బందులు పడుతున్నారని పేరెంట్స్ నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం నుంచి కేంద్రాలు తెరవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు అన్ని సెంటర్లను తెరుస్తున్నట్లు చెప్పారు. అలాగే కోటసీతారాంపురంలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాలను ఎంపీటీసీ వై.అరుణకుమారి, సచివాలయ కన్వీనర్ వెంకటరమణ ఆధ్వర్యంలో వలంటీర్లకు అప్పగించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జోగింపేట సర్పంచ్ కె.సింహాచలం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


జోగింపేట అంగన్వాడీ కేంద్రంలో సరుకులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, సీడీపీఓ సుగుణ

రైతులకు న్యాయం జరిగేలా చూడాలి

పాలకొండ రూరల్: ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. స్థానిక అభయాంజనేయ ఆలయం వద్ద గురుబిల్లి అప్పలనాయుడు అధ్యక్షతన గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ధాన్యం ఉభయగోదావరి జిల్లాలకు లైన్‌కు తరలించి రైతుకు న్యాయం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో స్థానిక మిల్లర్లు రద్దు పేరిట క్వింటాకు 5 కేజీలు అదనంగా సేకరిస్తూ.. రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను కారణంగా తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జంబ్లింగ్ విధానంలో రైతుకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మహాసభల నిర్వహణకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కె.రామ్మూర్తినాయుడు, బొత్స గౌరునాయుడు, తదితరులున్నారు.


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు